క్లుప్తంగా

అంగన్‌వాడీలో చిన్నారులకు అన్నప్రాసన



అమరచింత: పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ పరిధిలోని ఆరు నెలల వయస్సు కలిగిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి రప్పించి వారికి అన్నప్రాసన చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ టీచర్ రాధిక మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు తమ అంగన్‌వాడీ పరిధిలో ఆరు నెలల వయస్సు కలిగిన చిన్నారులకు బాలామృతం అందించామన్నారు. బాలమృతాన్ని చిన్నారులకు రోజువారీగా ఎలా అందించాలన్న విషయాలను తల్లులకు వివరించారు. పౌష్టికత్వంతో ఉన్న బాలమృతం చిన్నారుల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి నివాసంలో శుక్రవారం పెబ్బేర్ పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములుయాదవ్, వల్లపురెడ్డి రణధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 మంది నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు చిన్నారెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు చిన్నారెడ్డి శాలువా, బొకేతో సన్మానించారు. కార్యక్రమంలో గొడుగు భాను, స్వామి, అబ్దుల్ ఖయ్యుం, శివ, గంధం అంజి, రాజు, నాగరాజు, శివ, లోకేష్, కార్తీక్, మోహన్, వేణు, భాను, సునీల్, సిద్దు, చందు, శంకర్, వెంకటేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ లబ్ధి



అమరచింత: మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వంశీచంద్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలలని కోరుతూ శుక్రవారం అమరచింత జామీయా మసీదు వద్ద కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మక్తల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ తౌఫిక్ మాట్లాడుతూ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలంటే కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో అధికారం ఇవ్వాలని కోరారు. గరీబీ హటావో అన్న నినాదంతో ఇందిరమ్మ రాజ్య స్థాపన కోసం రాహుల్ గాంధీ చేస్తున్న ఆందోళనకు యావత్ దేశ ప్రజలు ఓటు ద్వారా మద్దతు ఇచ్చి సుపరిపాలనకు అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అల్తాఫ్, అస్సూ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



పెబ్బేరు రూరల్: పట్టణంలోని చెలిమిల్లలో గల మాంటిస్సోరి పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువు విజ్ఞానాన్ని అందిస్తుందని, విద్యార్థులు అన్ని రకాలుగా సిద్ధమైనపుడే లక్ష్య సాధన సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, అంబిక, అనురాధ, గాయత్రి, రాబర్ట్, గౌతమి, వసంత పాల్గొన్నారు.

పరిహారం ప్రకటించాలి

కొల్లాపూర్ రూరల్: ఇబ్రహీంపట్నం నాదర్‌గుల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు మందలించడంతో 9వ తరగతి చదువుతున్న వివేక్ పాఠశాల గదిలోనే ఉరేసుకొని ఇటీవల మృతిచెందాడు. ఉపాధ్యాయుని వెంటనే సస్పెండ్ చేయాలని, విద్యార్థి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్ గ్రేసియా ప్రభుత్వం ఇవ్వాలని బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బంకల దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల గురుకుల పాఠశాలలో విద్యార్థులు బలమరణాలకు గురవుతున్నారని ఈ మరణాలపై ప్రభుత్వం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీని శుక్రవారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తారాసింగ్ సమక్షంలో ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా తరుణ్, ప్రధాన కార్యదర్శిగా ఏ.శివకుమార్, ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ, భానుప్రకాష్, నందకుమార్, సహాయ కార్యదర్శులుగా నితిన్, మంజునాథ్, సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా కార్తీక్, గణపతి, భైరవ, చంటి, చరణ్, జస్వంత్, స్వరాజ్, చందు, శివకుమార్‌లు ఎన్నికయ్యారు.

చీడపీడల నుంచి రక్షణ లభించేనా?

- మామిడి తోటలకు కవర్ల ఏర్పాటు
- బాక్స్‌ల కొనుగోలుతో రైతులకు అదనపు భారం
- కమీషన్లతో నిండా మునుగుతున్న రైతులు



విక్రయించేందుకు కాయలను బాక్స్‌ల్లో తీసుకువెళ్తున్న రైతులు



వీపనగండ్ల శివారులో మామిడి కాయలకు కవర్లు కడుతున్న రైతు

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటలను సాగుచేస్తున్న రైతులు కాయలను పండించడంలో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. తోటల్లో పిందెలు ఏర్పాటయ్యే దశలో కవర్లను కట్టడం వల్ల చీడపీడల బారి నుంచి మామిడి కాయలను నాణ్యతగా తయారు చేయాలన్న సదుద్దేశ్యంతో రూ.వేలు ఖర్చు చేస్తున్నారు. తీరా మామిడికాయల విక్రయం కోసం సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి కమీషన్లు, తరుగు పేరుతో 20 శాతం డబ్బులను కోల్పోవాల్సి వస్తుంది. కొల్లాపూర్‌లో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో మామిడి తోటల రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మామిడి మార్కెట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మండలంలో 4,801 ఎకరాలలో సాగు

మండలంలోని వివిధ గ్రామాల్లో 4,801 ఎకరాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. బొల్లారం 404 ఎకరాలు, కొర్లకుంటలో 182 ఎకరాలు, వల్లభాపురంలో 65 ఎకరాలు, గోపల్‌దిన్నెలో 386 ఎకరాలు, గోవర్ధనగిరిలో 837 ఎకరాలు, కల్వరాలలో 338 ఎకరాలు, పుల్గర్‌చర్ల 192 ఎకరాలు, సంగినేనిపల్లిలో 347 ఎకరాలు, సంపత్‌రావుపల్లిలో 243 ఎకరాలు, తూముకుంటలో 602 ఎకరాలు, వీపనగండ్లలో 1,201 ఎకరాల్లో మామిడి తోటలను ఉన్నాయి.

కవర్లతో అదనపు భారం

మామిడి తోటల్లో తేనెమంచు తెగులు వల్ల పంటల దిగుబడి తగ్గిపోవడమే కాకా మామిడి కాయల నాణ్యత తగ్గిపోతుండడంతో రూ.3,500 ఖర్చు చేసి కవర్లను తీసుకొచ్చి మామిడి కాయలకు అమర్చుతున్నారు. దీంతోపాటు కాయలు తెంపే దశలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రవాణా కోసం తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక బాక్స్‌లను కొనుగోలు చేస్తున్నారు. జడ్చర్ల, హైదరాబాద్ లాంటి పట్టణాలకు రవాణా చేసేందుకు రూ.వేలు రైతులు ఖర్చు చేస్తున్నారు.

మార్కెట్ ఏర్పాటు చేయాలి

కవర్ల ఖర్చుతో పాటు రవాణా, దళారీల బారి నుంచి మామిడి రైతులు తప్పించుకోవాలంటే మామిడి మార్కెట్ ఏకైక మార్గం. కష్టపడి పండించిన పంటలో ఎక్కువ శాతం తరుగు పేరుతో దళారీలే లాగేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మార్కెట్ ఏర్పాటుకు కృషి చేయాలి.

– చెన్నమోని గంగయ్య, మామిడి తోటల కౌలు రైతు, వీపనగండ్ల

లాభాలు లేక..

పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో నిరాశకు గురై 100 చెట్లు ఉన్న తోటను తొలగించాను. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి మామిడి తోటల రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలి. తోటలు తగ్గిపోతే రాబోయే తరాల వారికి మామిడి పండ్లు అందే పరిస్థితి ఉండదు.

– ఎత్త బాలస్వామి, వీపనగండ్ల

కవర్ల ఏర్పాటుతో లాభమే

మామిడి రైతులు కాయలకు కవర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల నాణ్యత పెరుగుతుంది. రేటు కూడ అదనంగానే వస్తుంది. చీడపీడల నివారణ కోసం రైతులు సమిష్టి చర్యలు తీసుకుంటే అధిక ప్రయోజనం ఉంటుంది.

– కృష్ణ, ఉద్యావన శాఖాధికారి, వీపనగండ్ల

కూలి పెంపుతో ఉపాధి కూలీలకు ఊతం



పాన్‌గల్: గ్రామాల్లో ఉపాధి కల్పించి వలసలు నిరోధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో పనులు చేస్తున్న వారికి దినసరి కూలీ ఈనెల 1వ తేదీ నుంచి రూ.300లకు పెంచారు. మండలంలో 15,687 జాబుకార్డులు ఉండగా 8,416 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం కూలీ దినసరి వేతనం పెంచింది. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.272 చెల్లించింది. మరో రూ.28 పెంచి ఈనెల 1వ తేదీ నుంచి గరిష్ట వేతనంగా కూలీ రూ.300 చేసింది. ఈ పెంపుతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి దృష్ట్యా కూలీలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పని చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లో జంగల్ కటింగ్, కాంటూరు కందకాలు, కాల్వల పూడికతీత, పొలాలకు రోడ్డు, భూమి లెవలింగ్ పనులు చేపడుతున్నారు. వీటికి తోడు మొక్కలకు నీరు అందించడం, ప్లాంటేషన్ వంటి పనులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

'అవినీతికి కొమ్ముకాయడం సరికాదు'



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెబ్బేరు రూరల్: అమరచింత మున్సిపాలిటీలో జరిగిన అవినీతికి సీపీఎం, బీజేపీ కౌన్సిలర్లు అండగా నిలవడం వల్లే చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, మోష విమర్శించారు. వారు శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అమరచింత మున్సిపాలిటీకి వివిధ ప్రభుత్వ పథకాల కింద రూ.18 కోట్లు మంజూరు కాగా.. రూ.9 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగిందని, దీనికి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ కారణమని ఆరోపించారు. వారిని గద్దె దించేందుకు ఫిబ్రవరి 16న సీపీఐ, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎంకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీస్ అందజేశారన్నారు. ఏప్రిల్ 4న అవిశ్వాసంపై ఓటింగ్ సమావేశం పెట్టారని తెలిపారు. అవిశ్వాసం నోటీసుపై సంతకం చేసిన సీపీఎం, బీజేపీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి రాలేదన్నారు. అవినీతి ఆరోపణలు ఉన్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ వారిని రాకుండా కుట్ర చేశారని మండిపడ్డారు. ఈ వైఖరిని సీపీఐ ఖండిస్తోంది అన్నారు. అవినీతిపరులకు బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు కళావతమ్మ, గోపాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని నిరసన



కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న నిక్సన్

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో కార్మికుల కుటుంబాలు గడవక ఇబ్బందులకు గురవుతున్నారని, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కార్మికులకు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతే కాకుండా ఇప్పటి నుంచి ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు ఇచ్చే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో బొజ్జన్న, తిరుపతయ్య, గోపాల్, బాలరాజు, హన్మంత్ ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల తొలగింపు అన్యాయం

కొల్లాపూర్: మండలంలోని చింతలపల్లి అంగన్‌వాడీ టీచర్లు భారతి, సుగుణలను రాజకీయ నాయకుల ఒత్తిడితో తొలగించడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, సహాయ కార్యదర్శి దశరథం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను హమాలీలతో కలిసి వారు విడుదల చేశారు. కొల్లాపూర్ ఐసీడీఎస్ సీడీపీఓ వైఖరి కారణంగా ప్రాజెక్టు పరిధిలోని అనేకమంది అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ టీచర్లను విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సత్యం, లక్ష్మణ్, పకీరా, శీను, బాలస్వామి న్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ఆన్‌లైన్‌లోనే చేపట్టాలి

పాన్‌గల్: ఇంటర్ అడ్మిషన్లను ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలని బీసీ సంఘం ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యుగంధర్‌యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రైవేటు జూనియర్ కళాశాల యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా కార్పొరేటు విద్య పేరుతో విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ అడ్మిషన్లను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా చేపట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

'మాదిగలపై చిన్నచూపు తగదు'

ఆత్మకూర్: రాష్ట్రంలో మూడు పార్లమెంట్ ఎస్సీ రిజర్వేషన్ స్థానాలు ఉండగా కాంగ్రెస్ పార్టీ మాదిగలకు సీట్లు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌చౌక్‌లో నిరసన చేపట్టారు. నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ రిజర్వ్ స్థానాల్లో మాలలకే సీట్లు కేటాయించడంపై మండిపడ్డారు. దళితుల్లో 20 శాతం కూడా లేని మాలలకు రెండు సీట్లు, ఊరికి ఒక్కరు కూడా లేని బైండ్ల కులానికి ఒక్క సీటు కేటాయించి జనాభాలో అత్యధిక శాతం ఉన్న మాదిగలకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. వెంటనే సీట్ల మార్పు చేయాలని, లేని పక్షంలో రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సోంబాబు, రామకృష్ణ, మాసన్న, జానకీరాం తదితరులు ఉన్నారు.



మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



పెబ్బేరులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లెల చిన్నారెడ్డి



అమరచింతలో..

అమరచింత: రంజాన్ మాసం చివరి శుక్రవారం కావడంతో పట్టణంలోని జామీయా మసీదులు ముస్లింలతో కిక్కిరిసిపోయాయి. పవిత్ర రంజాన్ నెలలో ఉపవాస దీక్ష చేపడుతున్న వారితో పాటు వివిధ గ్రామాలకు చెందిన ముస్లింలు పవిత్ర నమాజు చేసేందుకు మసీదులకు తరలివచ్చారు. ఈమేరకు మౌలానా అల్తాఫ్ బేగ్ మహ్మద్ ప్రవక్త బోధనలతో పాటు దివ్యఖురాన్‌లో లిఖించబడిన అల్లా సూక్తులను చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ అల్లాపై భక్తి భావంతో ఉండాలన్నారు. నిరుపేదల పట్ల ప్రేమ, కరుణను చూపాలని కోరారు. నిత్య సంపాదనలో ఏడాదిలో పదో వంతును దైవ కార్యక్రమాలతో పాటు పేదలకు సహకారం అందించేందుకు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిరోజు ఐదు పూటల నమాజులో పాల్గొనాలని సూచించారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్, సభ్యులు ఖాజాహుస్సేన్, అన్సారి, ఖాసీం, రఫీక్ మసీదులో సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మస్‌జీద్‌లో ముస్లింలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం మస్‌జీద్‌లో ఆయన ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతం పండ్లు, స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆదిత్యారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించాలి



మాట్లాడుతున్న నాయకులు

పెబ్బేరు రూరల్: జాతీయ ఉపాధి హామీ చట్టంలో పనులు చేయిస్తున్న మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం, సీనియర్ మేట్ల సంఘాల ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలకేంద్రం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న కొత్త గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ చట్టం కింద పనులు చేయిస్తున్న సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిస్టెంట్లుగా తీసుకోవాలని కోరారు. మొక్కల పెంపకంలో పనిచేస్తున్న వాచర్లకు ఏడాది పొడవున 250 రోజుల పని దినాలు కల్పించి, వారికి ప్రత్యేక మస్టర్ కాపీ ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 8 వారాల కూలి డబ్బులు తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అజయ్, ఎస్ రాజు, శ్రీనునాయక్, ఆర్ దేవన్న, వెంకటయ్య, వసీరాం, శేఖర్, చంద్రమోహన్, వెంకటేష్, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనిత

కొత్తకోట రూరల్: మహిళలు ఆర్థిక స్వాలంబన దిశగా అడుగులు వేయాలని కేవీకే సీనియర్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ కోగారే, శాస్త్రవేత్త అనిత అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, మదనాపురం ఆధ్వర్యంలో పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో షెడ్యూల్ కులాల ప్రణాళికలో భాగంగా చిరుధాన్యాల కుటీర పరిశ్రమ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ చిరుధాన్యాలలో మెరుగైన పోషకాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు చేర్చుకోవడం ద్వారా డయాబెటిస్, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్‌ను నివారించొచ్చని పేర్కొన్నారు. చిరుధాన్యాలతో చేసే బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉందని, మహిళలు వీటి తయారీలో శ్రద్ధ వహించి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. అనంతరం బేకరీ ఓవెన్, పిండిగిర్ని అందించడంతో పాటు యూనిట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ జయమ్మ, మాజీ సర్పంచ్‌లు తిక్కన్న, సిద్ధయ్య, కాంగ్రెస్ నాయకులు లక్ష్మారెడ్డి, శ్రీశైలం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రాం సేవలు మరువలేనివి



కొత్తకోటలో బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే మేఘారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, వక్తలు అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రధాన కూడళ్లలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలు ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. ఆయన కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశం గర్వించే బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య, బొంత రాజశేఖర్, ఓఎస్ఏ డాక్టర్ షహనాజ్, డాక్టర్ విద్య, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని, తహసీల్దార్ అబ్రహంలింకన్, డాక్టర్ పీజే బాబు, సుభాష్, ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్, డాక్టర్ నరసింహాశర్మ, గిరిరాజాచారి, గంధం నాగరాజు, దేవన్న నాయుడు, మహానంది, గంధం గట్టయ్య, గోపి, యాదగిరి, అజయ్, శ్యాంసుందర్ ఉన్నారు.



వీపనగండ్లలో..



వనపర్తిలో..



మోజర్ల ఉద్యాన కళాశాలలో..



అమరచింతలో..



పెబ్బేరులో..



మదనాపురం తహసీల్దార్ కార్యాలయంలో..



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో..

మోదీ సారథ్యంలోనే దేశంలో అభివృద్ధి



బీజేపీలో చేరుతున్న నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీకే అరుణ

కొత్తకోట రూరల్: కొత్తకోట బీఎస్పీ మండల పార్టీ అధ్యక్షుడు రాజమౌళితో పాటు 100మంది కార్యకర్తలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. బీజేపీలో చేరుతున్న వారికి మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పదేళ్ల కాలంలో భారతదేశానికి ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. ప్రపంచ దేశాలకు భారతదేశం ఆదర్శంగా ఉండే విధంగా తయారు చేశాడని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పాత, కొత్త తేడా లేకుండా అందరూ కష్టపడి పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, భరత్‌భూషణ్, కనిమెట్ట రాజేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, సాయిరాం, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: రాష్ట్రంలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామని బీజేపీ మక్తల్ నియోజకవర్గ కన్వీనర్ బొక్కబాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో బీజేపీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించబోతుందని, 12 పార్లమెంట్ స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆత్మకూర్‌లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని, మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అశోక్‌జీ, రేచింత శ్రీను, అశ్విన్‌కుమార్, మేర్వరాజు, నాగేందర్‌రెడ్డి, సూరి, క్యామభాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, భీంరెడ్డి, హరీష్, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.